క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం ప్రతిష్ట



పూజలు చేస్తున్న సర్పంచ్ శాంతకుమారి, భక్తులు

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రం మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వర స్వామి దేవాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమం శనివారం నిర్వహించారు. మత్స్య లింగేశ్వర స్వామి సమగ్ర గ్రామ అభివృద్ధి సేవ సంఘం, విరాళ దాతల సాయంతో సర్పంచ్ మఠం శాంతకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మఠం సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం జరిపారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మత్స్యకొండబాబు, పంచాయతీ పెద్దలు అప్పారావు, కేశ్వరరావు నాయుడు, సింహాచలం, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

కొయ్యూరు: కినపర్తి పంచాయతీ గాదేగుమ్మి సమీపంలో వెలసిన గిరిజా తాండవేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ భారీ ఎత్తున అన్నసమరాధన ఏర్పాటు చేసింది. విశ్వహిందు పరిషత్ ప్రతినిధి మల్లిబాబు, సమరసతా ఫౌండేషన్ సభ్యులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు వారు తెలిపారు.


రామాలయం నిర్మాణానికి భూమి పూజ



పెదగార్లపాడులో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

గంగవరం : పెదగార్లపాడు గ్రామంలో నిర్మించనున్న సీతారామాలయం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.కృష్ణ దంపతులు భూమి పూజ నిర్వహించగా, వేదపండితులు హోమం చేపట్టారు. గ్రామపెద్దలు రామన్నదొర, స్వామి దొర, చిన్నాలుదొర, నరసన్నదొర, మాజీ సర్పంచ్ కె.లక్ష్మి, వీఎస్ఎస్ చైర్మన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇందుకూరుపేటలో ఇంటిపై కూలిన విద్యుత్ స్తంభం

దేవీపట్నం: ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఇందుకూరుపేటలో విద్యుత్ స్తంభం ఇంటిపై కూలింది. స్థానిక ఆంజనేయ స్వామి గుడి వీధిలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు వెళ్లే 11కె.వి. విద్యుత్ వైర్లు గల స్తంభం కట్టుమూరి రాములను వ్యక్తి ఇంటిపై శనివారం సాయంత్రం కూలింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

సంప్రదాయాలను పరిరక్షించాలి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో జనజాతి(గిరిజన)సురక్షా మంచ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంచ్ రాష్ట్ర కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని కోరారు. మతం మారిన గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. పాడేరులో ఏప్రిల్ 9న జరగనున్న గిరిజన సంస్కృతి సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నీలకంఠం, లైకోన్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

'పది'కి పక్కా ప్రణాళిక

- ప్రత్యేక తరగతుల నిర్వహణ
- ఉత్తమ ఫలితాల దిశగా ఉపాధ్యాయుల బోధన



ప్రత్యేక తరగతులకు హాజరైన టెన్త్ విద్యార్థులు

ముంచంగిపుట్టు: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో ముఖ్యమైన దశ. విద్యార్థి పదిలో సాధించిన మార్కులు భవిష్యత్తును నిర్ణయించేందుకు ఉపయోగపడతాయి. పదో తరగతిలో ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తమ ఫలితాలు పొందేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పక్కా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. వెనుకబడిన, మధ్యస్త, మెరుగైన విద్యార్థులను విభజించి అందరూ సమాన స్థాయికి చేరేలా ప్రత్యేక బోధనను అందిస్తున్నారు.

విద్యార్థుల ఒత్తిడి దూరం చేసేందుకు చర్యలు

విద్యార్థులు మొట్టమొదటిగా పబ్లిక్ పరీక్షలను ఎదుర్కొంటున్న సమయంలో కాస్త భయంతో ఒత్తిడికి లోన్ అయ్యే ఆస్కారం అధికంగా ఉండడం సహజం . ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా ప్రాథమిక అంశాలనూ బోధిస్తూ, పబ్లిక్ పరీక్షలు అంటే భయాన్ని వీడాలనే విషయాన్ని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులను ఏ,బీ,సీ,డీ బృందాలుగా విభజించి, విద్యార్థుల హాజరు, చదివిన, చదువుతున్న అంశాలను పరిశీలిస్తూ వారు మెరుగుపడేలా శ్రద్ధ తీసుకుంటున్నారు.

ప్రత్యేక తరగతుల నిర్వహణ

ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. చదివిన అంశాలు గుర్తుండేలా ప్రతి వారం పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రత్యేక కాల నిర్ణయ పట్టిక మేరకు వారంలో అన్ని సబ్జెక్టుల పరీక్షలు రాసేలా చూస్తున్నారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో కలిగే లాభాలను విద్యార్థులకు వివరిస్తూ ఉత్సాహాన్ని నింపుతున్నారు.

ప్రత్యేక కార్యాచరణ



విద్యార్థులు చదువుతున్న తీరు తదితర అంశాలపై తరుచూ సమీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక కార్యాచరణ ద్వారా విద్యార్థులపై దృష్టి సారిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఎం.మాణిక్యాలరావు, హెచ్ఎం, బాలుర పాఠశాల–1, ముంచంగిపుట్టు

అమ్మవారి జాతరకు ముమ్మర ఏర్పాట్లు



నూకాలమ్మ అమ్మవారు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు సర్పంచ్ గొల్లపూడి రమణి, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామంలో రంగురంగుల విద్యుత్ దీపాలు, స్వాగత ద్వారాలు, చలువ పందిర్లు వేశారు. ఆలయానికి రంగులు వేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. మూడు రోజుల జాగారాల సందర్భంగా గరగ నృత్యాలు, కోలాటం, తదితర కళా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.భక్తులు క్రమపద్ధతిలో క్యూలో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. జెయంట్‌వీల్, మిని సర్కస్ వంటి ఏర్పాట్లు చేశారు. కొత్త అమావస్య అనంతరం ఉగాది పండుగ రోజు తెల్లవారు జామున అమ్మవారి గుడి తలుపులు మూసేస్తారని, ఈ లోగానే అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

80 మందికి కంటి వైద్య పరీక్షలు



అరడకోటలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కిశోర్‌కుమార్

పెదబయలు: వైఎస్సార్ కంటి వెలుగు అవ్వా తాత పథకం మూడవ కార్యక్రమంలో భాగంగా దృష్టి లోపం ఉన్న వారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆప్తమాలజిస్ట్ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని అడుగులపుట్టు, పర్రెడ గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన శిబిరంలో 83 మందికి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ శిబిరంలో 39 మందికి దృష్టి లోపం ఉండడంతో కళ్లద్దాల కోసం ప్రతిపాదించినట్టు చెప్పారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వా, తాతల కోసం కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్టు తెలిపారు. పెదబయలు మండలంలో వైఎస్సార్ కంటి వెలుగు మొదటి విడతలో 1469 మందికి పరీక్షలు చేసి దృష్టి లోపం ఉన్న వారికి కళ్లద్దాలు అందించామని, మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఏఎన్ఎం సుమలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ అక్కమ్మ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పావని తదితరులు

గంగవరం : వైఎస్సార్ ఆసరా ద్వారా మండలంలో 330 పొదుపు సంఘాల్లో గల 3016 మంది సభ్యులకు రూ. 1.31కోట్లు అందించనున్నట్టు ఎంఎంఎస్ అధ్యక్షురాలు మండల మహిళా సమాఖ్యా అధ్యక్షురాలు శారపు పావని తెలిపారు. కొత్తగంగవరం గ్రామంలో గడప గడపకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కొత్త గంగవరం గ్రామంలో మధ్యవీధి, ప్రెసిడెంట్‌గారివీధి, దిబ్బల వీధి, పాత బ్యాంక్ వీధిలకు చెందిన మహిళా సంఘాల మహిళలతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా సాధించవచ్చన్నారు.వైఎస్సార్ అసరా పథకం గురించి అవగాహన కల్పించారు. సర్పంచ్ కలుముల అక్కమ్మ, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, మండల పరిషత్ ఏఓ సిద్దేశ్వరరావు, వెలుగు ఏపీఎం రాజు, సీసీలు శాంతిరాజు, విజయలక్ష్మి, హెచ్‌డీ సీసీ సత్యవతి, గ్రామసంఘం వీఓ కలుముల రమణమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కోసు బుల్లియమ్మ, వీవో సభ్యులు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభించాలని వినతి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ వంతెన నిర్మాణ పనులను ప్రారంభించాలని ఎంపీడీవో కిరణ్‌కుమార్‌ను సర్పంచ్ త్రినాథ్ శనివారం కలిసి విన్నవించారు. లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు వరకు బిరిగూడ, ముత్తగుమ్మి, సుత్తిగూడ వంతెనల పరిస్థితిని వివరించి, పనులను ప్రారంభించాలని కోరారు. సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ వర్షం కాలంలో బిరిగూడ వద్ద వాగు పొంగి 20 గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం బిరిగూడ వద్ద వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, వెంటనే పనులు ప్రారంభించి, పూర్తి చేసి వర్షకాలం రాకపోకల అవస్థలు తొలగించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత ఉపాధ్యాయ కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజవొమ్మంగి: మండలంలో అనారోగ్యంతో మృతి చెందిన ఇరువురు ఉపాధ్యాయులకు యూటీఎఫ్ శనివారం రూ. 6లక్షల సంక్షేమ నిధిని అందజేసింది. బట్టావారివీధి పాఠశాలలో పనిచేస్తు మరణించిన సుబ్బారావు, అంబేడ్కర్ వీధి పాఠశాలలో పని చేస్తూ మరణించిన చిన్నబ్బాయి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చెక్కులను జిల్లా యూటీఎఫ్ నాయకుడు పి.వి. సత్యనారాయణ అందజేశారు. ఫెడరేషన్ ప్రతినిధులు పైడిమల్లు, రమణ, ప్రసన్న, సత్యవతి, శ్రీనుబాబు, రమేష్, నాగసుశీల, సుబ్బాయమ్మ, ఝాన్సీరాణి, రామకృష్ణ, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం



అగ్నిబాధితులకు ఆర్థికసాయమందిస్తున్న ఎంపీపీ రమేష్, నేతలు

కొయ్యూరు : కొత్తపల్లి అగ్నిబాధితులకు అండగా ఉంటామని ఎంపీపీ బడుగు రమేష్ హామీ ఇచ్చారు. ఆయన శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారితో మాట్లాడుతూ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బాధితుల ఇబ్బందులను కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టిలో ఉంచారన్నారు .ప్రభుత్వం నుంచి పరిహారం త్వరితగతిన అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన రూ.పదివేల నగదును అగ్ని ప్రమాద బాధితులు రీముల శ్రీను, ఎర్రయమ్మ, రాటా మల్లేశ్‌లకు అందజేశారు. ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన రికార్డుల స్థానంలో కొత్తవి మంజూరు చేయిస్తామన్నారు. ఇటీవల జీడితోటలు కాలిపోవడంతో రైతులు భారీగా నష్టపోయిన విషయాన్ని కలెక్టర్ దృష్టిలో ఉంచగా, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కొద్దిరోజుల కిందట తాటిమానిపాలెంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వారికి కలెక్టర్ పరిహారం ఒకొక్కరికి రూ.25 వేలు అందించినట్టు తెలిపారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, చింతపల్లి ఏఎంసీ చైర్ పర్సన్ రాజులమ్మ, సర్పంచ్ చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, మండల కన్వీనర్ సుధాకర్, మహిళా అధ్యక్షురాలు సావిత్రి, నాయకులు కన్నబాబు, వెంకయమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు

బీమా పథకాలపై అవగాహన



ఖాతాదారులతో బ్యాంకు బీఎం నాగరాజు

వై.రామవరం: గ్రామస్థాయి ఆర్థిక సమీకృత కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద బ్రాంచి మేనేజరు యు.నాగరాజు ఆధ్వర్యంలో ఖాతాదారులకు వివిధ రకాల ఇన్సూరెన్సులు, బ్యాంకు బీమా పథకాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ అటల్ పెన్షన్ యోజన, బీమా యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది దీపక్, సాయి శ్రీనివాస్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండమ్మ ఆలయంలో బోరు ఏర్పాటు



బోరు పనులు పర్యవేక్షిస్తున్న శివప్రసాద్

కొయ్యూరు: శరభన్నపాలెం–నడింపాలెం మధ్యలో వెలసిని ఎర్రగొండమ్మ తల్లి ఆలయం వద్ద అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆదేశాల మేరకు నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ శనివారం బోరు వేయించారు. ఆలయంలో బోరు లేకపోవడంతో భక్తులు తాగునీటికి ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం బోరు ఏర్పాటుతో సమస్య తీరుతుందని శివప్రసాద్ చెప్పారు.

వర్షంతో పంటలకు ఊరట

దేవీపట్నం: మండలంలో శనివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ ప్రాంతంలో సాగు చేసిన రబీ వరి, మొక్కజొన్న పంటలు ప్రస్తుతం సాగునీరు లేక రైతులు తీవ్రనీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కురిసిన వర్షం పంటలకు ఊరట నిచ్చింది. ఈదురుగాలులు, వడగండ్లు లేకపోవడంతో అంతంత మాత్రంగా కాసిన మామిడి, జీడిమామిడి తోటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ముసురుమిల్లి ప్రాజెక్టు ప్రధాన కాలువ ఆధారంగా మెట్టభూముల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట ప్రస్తుతం కళ్లాల్లో ఉండడంతో కళ్లాలు తడిసిముద్దయ్యాయి. మరో రెండు రోజులు పాటు వర్షాలు పడే సూచనలు కనిపిస్తుండడంతో కళ్లాల్లోని మొక్కజొన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో నో స్కూల్ బ్యాగ్ డే

గంగవరం : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నో స్కూల్ బ్యాగ్ డేను శనివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులు మట్టితో చేసిన బొమ్మలు, వివిధ కళాకృతులు ఆకట్టుకున్నాయి. నో స్కూల్‌బ్యాగ్ డే కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యత పెంపొందుతుందని ఎంఈవో మల్లేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బడి పిల్లలు శ్రద్ధగా పాఠశాలకు వచ్చేందుకు ఈ విన్నుత కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు.

క్షయ వ్యాధిపై ఆందోళన వద్దు



హుకుంపేటలోని అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు గాయత్రి, శాంతి, సిబ్బంది



ఉలిగోగులలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుకుంపేట: మండల కేంద్రంలో క్షయ వ్యాధి నివారణపై వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిపై భయాందోళన చెందవద్దని, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చనాన్రు. రెండు వారాలకు పైగా దగ్గు, రాత్రి పూట జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం అందించి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డతీగల: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని దుప్పులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన అన్నారు. అడ్డతీగల మండలం ఉలిగోగులలో దుప్పులపాలెం పీహెచ్‌సీ సిబ్బంది అక్కడి ప్రజలకు క్షయ వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు, జ్వరం , బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా అందుబాటులోని వైద్యులను సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వేసుకోవాలన్నారు. మరొకరికి సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలు అంశాలను ప్రజలకు వివరించిన అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.జీత్ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ బాబూరావు, హెల్త్ అసిస్టెంట్ శంకరప్రసాద్, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు, జీత్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశంలో సమస్యల వెల్లువ





జెడ్పీ సమావేశంలో సమస్యలు వివరిస్తున్న కూనవరం, రాజవొమ్మంగి జెడ్పీటీసీ సభ్యురాలు విజయ, జ్యోతి

కూనవరం: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కూనవరం జెడ్పీటీసీ గుజ్జా విజయ కోరారు. కాకినాడ జిల్లా పరిషత్‌లో శనివారం నిర్వహించిన స్థాయి సంఘం సమావేశంలో మండలానికి సంబంధించిన వివిధ సమస్యలను ఆమె అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. గత ఏడాది వచ్చిన గోదావరి వరదల్లో పూర్తిస్థాయి నష్ట పరిహారం అందేలా చూడాలని కోరారు. గిరిజన రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, సోలార్ పంపుసెట్లు రైతులకు అందజేయాలని కోరారు. కోతులగుట్ట నుంచి బోదునూరు మీదుగా ఏడుగురాళ్లపల్లి వరకు పక్కారోడ్డు నిర్మించాలని, కోతులగుట్ట సీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యులని నియమించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతి పత్రాన్ని జెడ్పీ చైర్మన్ విపర్తి వేణుగోపాలరావుకు అందజేశారు.

రాజవొమ్మంగి: ఉపాధి హామీ పనుల ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులకు మెటీరియల్ బిల్లులు కాక ఇబ్బందులు ఎదురౌతున్నాయని రాజవొమ్మంగి జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి కాకినాడలో జరిగిన జెడ్పీ సమావేశంలో తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ బిల్లులు అప్‌లోడ్ చేయడంలో సాంకేతిక పరమైన సమస్యలు ఎదురై, బిల్లులు మంజూరు కాక ఇబ్బంది పడుతున్నారన్నారు. పూర్తయిన పనులకు బిల్లులు మంజూరయ్యేలా చూడాలని ఆమె ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కోరారు. ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి



నెల్లిపాకలో తడిచిన మిర్చిని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

ఎటపాక: అకాల వర్షానికి తడిసిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వరావు కోరారు. శనివారం వర్షానికి కల్లాల్లో తడిచిన మిర్చిని పార్టీ బృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ చీడపీడలు, గోదావరి వరదల కారణంగా ఇప్పటికే నష్టాలు చవిచూస్తున్న మిర్చి రైతులను అకాల వర్షం నిండా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు.చేతి కందిన పంట వర్షానికి చేజారిపోవడంతో రైతులు తీవ్ర అప్పల ఊబిలో కూరుకుపోయారఅన్నారు.ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నారు.

ముంచెత్తిన వర్షం



కొయ్యూరులో వర్షం



చింతపల్లిలో జలమయమైన రోడ్డు





రాజవొమ్మంగి, దుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

అనంతగిరి/దుంబ్రిగుడ/హుకుంపేట/చింతపల్లి రూరల్/కొయ్యూరు/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.రహదారులు జలమయమయ్యాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో శనివారం భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొయ్యూరు మండలంలోని కృష్ణ దేవిపేట సమీపంలో చెట్టు కూలిపోవడంతో తొలగించేందుకు చాలా సమయం పట్టింది. జీడిమామిడి పూతకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంపచోడవరం అడ్డతీగల మండలాల మధ్య ప్రధాన విద్యుత్ లైన్‌లో సాంకేతిక పరమైన సమస్య తలెత్తడంతో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్, సెల్ సర్వీసులు మొరాయించాయి.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com